క్లుప్తంగా

బీవీ శ్రీనివాస్‌కు డాక్టరేట్



శ్రీనివాస్‌కు డాక్టరేట్ అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన అధ్యాపకుడు బీవీ శ్రీనివాస్‌కు ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. శ్రీనివాస్ ప్రస్తుతం జిల్లాలోని నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. ఆయన గత 35 సంవత్సరాలుగా విద్యారంగంలో చేస్తున్న సేవలను గుర్తించి డాక్టరేట్‌ను ప్రకటించింది. ఆదివారం న్యూ ఢిల్లీ నోయిడాలోని మయూర్ విహార్ హాలిడే ఇన్‌లో నిర్వహించిన స్నాతకోత్సవ కార్యక్రమంలో డాక్టరేట్‌ను అతిథులు అందజేశారు.

కళాజాతరకు గురుశర్మకు ఆహ్వానం



గురుశర్మ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అంతర్జాతీయ స్థాయిలో అనేక సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ కళాకారులను ప్రోత్సహిస్తున్న శ్రీశ్రీ కళావేదిక త్వరలో నిర్వహించబోయే కళా జాతర కార్యక్రమానికి నగరానికి చెందిన రచయిత, సాహితీవేత్త గురుశర్మకు ఆహ్వానం పంపింది. ఈ నెల 19, 20 తేదీల్లో తాడేపల్లిగూడెంలోని బుద్దాల కన్వెన్షన్ హాలులో 24 గంటల పాటు నిర్విరామంగా రికార్డు స్థాయిలో కళా జాతర కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రపంచ తెలుగు కవి సమ్మేళనం, సాహిత్య సదస్సులు, రంగస్థ కళాప్రదర్శనలు, పుస్తకావిష్కరణలు వంటి సాహిత్య కార్యక్రమాలు నిర్వహించనున్నామని శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులను నామినేట్ చేయాలి

ఏలూరు (టూటౌన్): ప్రజాప్రతినిధులుగా విభిన్న ప్రతిభావంతులను నామినేట్ చేయాలని వికలాంగుల సంక్షేమ సంఘం (విసాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి నటరాజు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. వైకల్యం ఉన్న వ్యక్తులు అన్ని రంగాల్లో సమ భాగ స్వామ్యం కోసం చట్ట సభల్లో ప్రవేశానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. శాసనసభ్యులుగా ముగ్గుర్ని, ఎమ్మెల్సీలుగా ముగ్గురికి అవకాశం కల్పించాలని కోరారు. శారీరకం (ఓహెచ్), అంధత్వం(వీహెచ్), చెవిటి- మూగ (డీడీ) తదితర విభిన్న ప్రతిభావంతులకు ఈ అవకాశం కల్పించాలని పేర్కొన్నారు

ఆటలకు చోటేదీ!

- ఏలూరు నగరంలో పిల్లల ఆవేదన
- అభివృద్ధికి నోచుకోని ఆట స్థలాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



స్టేడియానికి వచ్చి ఆడుకుంటున్న చిన్నారులు



ఏలూరు ఇండోర్ స్టేడియంలో క్రికెట్ ఆడుతున్న యువకులు

ఏలూరు రూరల్ : ఏలూరు నగరంలో ఆట స్థలాలు కరువయ్యాయి. నగరం మునిసిపాలిటీ నుంచి కార్పొరేషన్‌కు అప్‌గ్రేడ్ అయినప్పటికీ ప్లే ఫీల్డ్స్ అభివృద్ధి కాలేదు. కార్పొరేషన్ పాలకవర్గం సభ్యులు, అధికారులు దీనిపై దృష్టి నిలపడం లేదు. వారంలో ఆరు రోజులు పిల్లలు పుస్తకాలతో కుస్తీ పడతారు. ఆదివారం లేదా సెలవు దినాల్లో ఆటలాడేందుకు ఉత్సాహం చూపుతారు. కాని కార్పొరేషన్ పరిధిలో ఆడేందుకు అనువైన ఆట స్థలాలు లేవు.

ప్రమాదకర స్థితిలో సాధన

నగరంలో 50 డివిజన్లు ఉన్నప్పటికీ కార్పొరేషన్‌కు చెందిన ఒక్క ప్లే ఫీల్డ్ అభివృద్ధి చేయకపోవడం శోచనీయం. పలు డివిజన్ల పాఠశాలల్లో చిన్నపాటి ఆట స్థలాలు ఉన్నాయి. అయితే ఆదివారం సెలవు కావడంతో ఉపాధ్యాయులు పాఠశాలలకు తాళాలు వేసేస్తున్నారు. సీఆర్ఆర్ కళాశాల యాజమాన్యం కూడా ఇదే ధోరణి అవలంభిస్తోంది. దీంతో పిల్లలు రోడ్లు, వీధి శివార్లు, కాలువ గట్లు, గుంటలు, గోతుల్లో ప్రమాదకర స్థితిలో ఆడుకుంటున్నారు. మరికొందరు పిల్లలు, యువకులు పెద్ద సంఖ్యలో ఇండోర్ స్టేడియానికి చేరుకుంటున్నారు. పదుల సంఖ్యలో స్టంప్స్ పాతి క్రికెట్ ఆడుతున్నారు. ఏ మూల నుంచి ఏ బాల్ వచ్చి తగిలినా పిల్లలు గాయపడే ప్రమాదం ఉంది. ఆదివారం అల్లూరి సీతారామరాజు స్టేడియంలో వందల సంఖ్యలో పిల్లలు ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్ తదితర ఆటలు ఆడారు. కార్పొరేషన్ అధికారులు ఇవేమీ పట్టించుకోవడం లేదు.

డివిజన్‌కు ఒక ఆట స్థలం అభివృద్ధి చేయాలి

కార్పొరేషన్ పరిధిలో 2.18 లక్షల మంది జనాభా ఉన్నారు. వీరిలో 17,600 మంది బాలబాలికలు, 35 వేల మంది యువతీ యువకులు ఉన్నారు. జనాభా ఆధారంగా నగరంలో ఒక్కో డివిజన్‌కు కనీసం ఒక ఆట స్థలం అభివృద్ధి చేయాలి. నేడు ప్రతి డివిజన్ పరిధిలో 3,500 నుంచి 4,500 మంది జనాభా ఉన్నారు. ఇందులో కనీసం 100 నుంచి 200 మందికి పైగా పిల్లలు ఉంటారు. వీరందరిలో క్రీడల పట్ల ఆసక్తి పెరగాలంటే ప్లే ఫీల్డ్స్ అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

స్కూల్‌లో ఆడుకోనివ్వరు



ఆదివారం, సెలవు రోజుల్లో ఆడుకోవాలని అనిపిస్తోంది. కాని మా స్కూల్‌లో ఆడనివ్వరు. అందుకే నేను, నా ఫ్రండ్స్ స్టేడియానికి వస్తున్నాం. ఇక్కడ పెద్దపెద్ద అన్నయ్యలు క్రికెట్ ఆడుతున్నారు. వాళ్ల బాల్స్ మాకు తగులుతాయని భయమేస్తుంది. అందుకే గోడ పక్కన ఆడుకుంటున్నాం.

– గీతేష్, విద్యార్థి

రోడ్డుపై ఆడితే తిడతారు



మమ్మీ, డాడీ ఆడుకోమంటారు. కాని దూరం వెళ్ల వద్దు అంటారు. మాది పవర్‌పేట. ఇంటి దగ్గర ఒక్క ప్లే ఫీల్డ్ లేదు. రోడ్డుపై ఆడాలి. స్కూటర్లు వస్తుంటాయి. భయమేస్తుంది. అక్కడ ఆడితే అందరూ తిడతారు. ఇల్లు వదిలి, నేను, నా ఫ్రండ్స్ స్టేడియానికి వచ్చాం. ఒక్కడ అందరూ క్రికెట్ ఆడుతున్నారు.

– సాత్విక్, విద్యార్థి

రోజూ ఆడుకోవాలని ఉంది



నాకు రోజూ ఆడాలని ఉంది. కాని మా ఇంటి దగ్గర ఆట స్థలం లేదు. అందుకే ఆదివారం ఆడుకునేందుకు స్టేడియానికి వచ్చాను. కాని ఇక్కడ చాలా మంది క్రికెట్ ఆడుతున్నారు. ఇప్పుడే ఒక బాల్ నా పక్క నుంచి వెళ్లింది. నాకు భయమేసింది. అయినా ఆడుకుని వెళ్లిపోతాం. మా ఇంటి దగ్గర గ్రౌండ్ ఉంటే చాలా బాగుంటుంది. రోజూ ఇంత దూరం రావాల్సిన పని ఉండదు.

– ప్రగ్నేష్, విద్యార్థి

ఆట స్థలాలను అభివృద్ధి చేయాలి



అధికారులు, పాలకుల దృష్టిలో అభివృద్ధి అంటే రోడ్లు, భవనాలు నిర్మించడమే. అన్న భావన కనిపిస్తోంది. పిల్లలు సైతం ఆడుకునేందుకు అనువైన పరిస్థితులు కల్పించాలి. ఇందుకోసం కార్పొరేషన్ ప్రత్యేక నిధులు కేటాయించాలి. ప్రపంచంలో అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో అత్యాధునిక వసతులతో కూడిన ఆటస్థలాలు ఉన్నాయి.

– అనిల్‌కుమార్, సత్రంపాడు

ప్రత్యేక క్రీడలకే అనుమతి



ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ నిబంధనల మేరకు స్టేడియాన్ని కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్ తదితర ప్రత్యేక క్రీడలకు మాత్రమే కేటాయించారు. ఆదివారం, సెలవు దినాల్లో పెద్ద సంఖ్యలో పిల్లలు, యువకులు స్టేడియానికి వచ్చి గోతులు తవ్వి స్టంప్స్ పాతి క్రికెట్ ఆడుతున్నారు. దీనివల్ల రన్నింగ్ ట్రాక్ పాడైపోతోంది.

– బి.శ్రీనివాస్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

కాలినడక భక్తుడిని ఢీకొన్న బైక్

ఏలూరు టౌన్: ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన భవానీ దీక్ష చేపట్టిన ఒక వ్యక్తి కనకదుర్గమ్మ గుడికి కాలినడకన వెళ్తుండగా మోటారు సైకిల్‌పై వస్తూ ఒక వ్యక్తి ఢీ కొట్టాడు. కాలుకు తీవ్ర గాయమైన భక్తుడిని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన పాలూరి దుర్గా ప్రసాద్ మరో ఐదుగురు కలిసి కాలినడకన శనివారం రాత్రి ఏలూరు నుంచి బయలుదేరి విజయవాడ కనకదుర్గమ్మ గుడికి వెళ్తున్నారు. వట్లూరు రైల్వే ఫ్లైవోవర్ బ్రిడ్జి సమీపంలోని సీఆర్ఆర్ మహిళా కాలేజీ వద్ద ఒక మోటారు సైకిలిస్టు అతి వేగంగా వచ్చి దుర్గాప్రసాద్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో అతడి కాలు విరిగింది. వెంటనే దుర్గా ప్రసాద్‌ను ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందించారు. హాస్పిటల్ వైద్యులు మెడికో లీగల్ కేసుగా నమోదు చేసి హాస్పిటల్ అవుట్ పోస్టు పోలీసులకు సమాచారం అందించారు.

నిందితుడిపై ఎన్‌బీడబ్ల్యూ జారీ

ఏలూరు టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణానికి కారకుడైన నిందితుడు బెయిల్‌పై ఉంటూ కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవటంతో అతనిపై కోర్టు సీరియస్ అయ్యింది. పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడికి న్యాయస్థానం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అతని ఆచూకీ తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని చిలకలపూడి సీఐ కె.అబ్దుల్ నబీ కోరారు. ఏలూరు రూరల్ మండలం పోణంగి కాలనీకి చెందిన బత్తుల జగన్నాథం 2014లో రోడ్డు ప్రమాద ఘటనలో అతనిపై చిలకలపూడి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో బెయిల్ పొందిన జగన్నాథం కోర్టు వాయిదాలకు హాజరు కాకపోవడంతో మచిలీపట్టణంలోని ఫస్ట్ ఏడీఎం కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. నిందితుడు జగన్నాథం వివరాలు తెలిసిన వారు కృష్ణా జిల్లా చిలకలపూడి పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 086 72252233 లేదా సీఐ అబ్దుల్ నబీ సెల్ నెంబర్ 83329 83789కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

నేడు పాలస్తీనాకు సంఘీభావంగా నిరసన



సమావేశంలో పాల్గొన్న వామపక్ష పార్టీల నాయకులు

ఏలూరు (టూటౌన్): పాలస్తీనాకు సంఘీభావంగా సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వామపక్ష పార్టీలు తెలిపాయి. స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో వామపక్ష పార్టీల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గాజాపై ఇజ్రాయిల్ ఆటవిక దాడులు ప్రారంభించి ఈ నెల 7వ తేదీతో ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 10 వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ఈ నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు చేపట్టే నిరసన కార్యక్రమంలో వామపక్ష పార్టీల శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇజ్రాయేల్ యుద్ధోన్మాద చర్యలు జాతి నిర్మూలనకు దారి తీస్తుందని ఈ ఏడాది జనవరిలో అంతర్జాతీయ న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. గాజాలో ఇజ్రాయేల్ సాగిస్తున్న ఊచకోత, రాక్షసత్వాన్ని నిరసిస్తూ తక్షణమే యుద్ధాన్ని ఆపాలని, కాల్పుల విరమణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాలస్తీనాకు సంఘీభావంగా జిల్లా వ్యాప్తంగా ప్రదర్శనలు, సభలు, సమావేశాలు, నిరసనలు నిర్వహించాలని పార్టీల శ్రేణులకు పిలుపు నిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, సీపీఐ కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలింపుపై కేసు

ఏలూరు టౌన్: ఏలూరు సమీపంలోని శనివారపుపేట రెడ్డమ్మ వీధిలో ఒక వ్యక్తి ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తున్నాడనే సమాచారంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. ఏలూరులోని పడమరవీధికి చెందిన సుధాకర్ అనే వ్యక్తి సుమారు వెయ్యి కిలోల రేషన్ బియ్యం ఆటోలో తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉంచాడు. ఈ బియ్యాన్ని పరిశీలించిన అధికారులు సీజ్ చేశారు. ఈ ఘటనపై శనివారపుపేట వీఆర్‌ఓ పుట్టా అజయ్ ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి జన్యావుల సుధాకర్‌ను అరెస్టు చేశారు.

నేడు జిల్లా అదనపు ఎస్పీ బాధ్యతల స్వీకరణ

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా అదనపు ఎస్పీగా నక్కా సూర్యచంద్రరావు నియమితులయ్యారు. ఆయన సోమవారం ఉదయం 10.15 గంటలకు ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన గత కొంతకాలంగా ఏలూరు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోగా పనిచేశారు. ఎన్నికల అనంతరం ఆయన్ని సీఐడీ కేంద్ర కార్యాలయంలో అదనపు ఎస్పీగా బదిలీ చేశారు. ఇటీవల రాష్ట్రంలో ఐదుగురు అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఐడీ విభాగంలో ఉన్న అదనపు ఎస్పీ సూర్యచంద్రరావును ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా నియమించారు.

వర్గీకరణ చేస్తే తిరుగుబాటు తప్పదు

గణపవరం: ఎస్సీ వర్గీకరణ చేయాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్రలో భాగమని, ఎస్సీల వర్గీకరణ చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తిరుగుబాటు తప్పదని మాలమహానాడు అధ్యక్షుడు, మాల సంఘాల జేఏసీ చైర్మన్ సీహెచ్ మంగరాజు హెచ్చరించారు. గణపవరంలో నిర్వహించిన మాలమహానాడు ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులగణన చేసిన తర్వాతే వర్గీకరణ విషయం ఆలోచించాలని కోరారు. చంద్రబాబు దళితులను విడదీసి మంద కృష్ణమాదిగను ప్రోత్సహిస్తూ మాలలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. వర్గీకరణను మాదిగకుల మేధావులైన ఎందరో వ్యతిరేకిస్తున్నారని అన్నారు. త్వరలో విజయవాడలో ఉమ్మడి రాష్ట్రస్థాయిలో మాలల మహాసభ నిర్వహించి మాలల గొంతు వినిపిస్తామన్నారు. ఈ సమావేశంలో మాలమహానాడు నాయకులు చోడదాసి జైపాల్, వెన్నపు సుధాకర్, సబ్బితిరాజు సునీల్, అచ్చిబాబు, కొండయ్య, జయకుమార్ పాల్గొన్నారు.

వివిధ అలంకరణల్లో అమ్మవార్ల దర్శనం



పవర్‌పేట రాజ్యలక్ష్మి



పత్తేబాద కనకదుర్గమ్మ



బావిశెట్టివారిపేట కనకదుర్గమ్మ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని వివిధ ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవార్లకు విశేష అలంకరణలు చేశారు. స్థానిక పవర్‌పేట శ్రీదేవి, భూదేవి సమేత వాసు ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి దయం క్షీరాభిషేకం, ఉభయదాతలచే విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బాలభోగ వినియోగం లక్ష్మి, లలితా సహస్రనామ పారాయణ, విశేష హారతులు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆదివారాహి దేవి అలంకరణ చేశారు. ఆలయ అర్చకుడు కందుకూరి వెంకట విజయ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి ఎం రామాంజనేయులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. పత్తేబాద కనకదుర్గమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి లలితా త్రిపుర సుందరి అలంకరణ చేశారు. బావిశెట్టివారి పేట కనకదుర్గమ్మవారికి గాయత్రీ దేవి అలంకరణ చేశారు.

సూర్యనారాయణకు సంగీత పురస్కారం



సూర్యనారాయణకు కేవీఎస్ సంగీత పురస్కారం అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన కేవీఎస్ ట్రస్ట్, ఫైన్‌ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో కేవీ సత్యనారాయణ సంగీత ప్రతిభా పురస్కారం -2024ను ప్రముఖ సంగీత విద్వాంసులు కుమార సూర్యనారాయణకు ప్రదానం చేశారు. ఆదివారం స్థానిక రామచంద్రరావు పేట మార్కండేయ వేద పాఠశాలలో నిర్వహించిన ఉత్సవంలో కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ కుమార సూర్యనారాయణ నృత్య సంగీత కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనడంతో పాటు శాస్త్రీయ, నృత్య గాయకుడిగా స్థిరపడి 12 వేల పైచిలుకు కార్యక్రమాలకు గాత్ర సహకారం అందించారని తెలిపారు. దేశంలో ఉన్న కూచిపూడి, భరత నాట్యం, ఆంధ్రనాట్యం కళాకారులకు గాత్ర సహకారం అందించి సంగీత నాట్య రంగాలకు ఎంతో సేవలు అందిస్తున్నారని, ఎన్నో నృత్య రూపకాలకు సంగీతం సమకూర్చి కళారంగానికి విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. తొలుత అభినయ నృత్యభారతి సంస్థ ఆధ్వర్యంలో నాట్యచార్య డి.హేమ సుందర్ శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో డీవీ రమణ, వీవీ హనుమంతరావు, పుల్లాభొట్ల పురుషోత్తం, కళాకారులు, కళాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వలకు చిక్కిన కొండచిలువ

బుట్టాయగూడెం: లక్ష్మీపురం సమీపంలో గల కొవ్వాడ ప్రాజెక్టులో చేపల కోసం వేసిన వలలో సుమారు 12 అడుగుల కొండచిలువ చిక్కింది. గ్రామానికి చెందిన తేనె రాజు చేపల కోసం ఆదివారం ఉదయం వల వేశాడు. సాయంత్ర సమయంలో వల వద్దకు వెళ్లి చూడగా దానిలో 12 అడుగుల కొండచిలువ ఉంది. అయితే దానిని ఒడ్డుకు తీసుకొచ్చేటప్పటికే మృతి చెందిందని రాజు చెప్పాడు. చనిపోయిన కొండచిలువను గ్రామ సమీపంలోని అటవీప్రాంతంలో పూడ్చిపెట్టినట్లు రాజు తెలిపాడు.

పేకాట స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడులో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.1,400 స్వాధీనం చేసుకున్నట్టు హెడ్ కానిస్టేబుల్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

వెంకన్నకు 108 వెండి పుష్పాల సమర్పణ



వెండి పుష్పాలు అందిస్తున్న భక్తుడు నాగ శ్రీహరి

భీమడోలు: దసరా ఉత్సవాల్లో భాగంగా గుండుగొలను వేంకటేశ్వర స్వామి వారికి ఆదివారం ఓ భక్తుడు బంగారు పూతగల 108 వెండి పుష్పాలను బహూకరించి తన భక్తిని చాటుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన భక్తుడు వగ్వాల నాగ శ్రీహరి స్వామి వారికి రూ.61,100తో 750 గ్రాముల బరువు గల బంగారు పూత గల 108 పుష్పాలను ఆలయ కమిటీ పెద్దలు వగ్వాల అచ్యుత రామారావు, అర్చకుడు మంగపతి ఆచార్యులకు అందజేశారు. తొలుత ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ పెద్దలు ఘన స్వాగతం పలికారు. దసరా ఉత్సవాల్లో భాగంగా పరిసర గ్రామాలకు చెందిన భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

6, 7, 8 తేదీల్లో స్త్రీల సభలు

దెందులూరు: గాలాయగూడెంలో బైబిల్ మిషన్ చర్చిలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో స్త్రీల సభలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు రెవరెండ్ పూజారి లాజర్ అన్నారు. మూడు రోజులు పాటు మహిళా సువార్తీకులు వాఖ్య పరిచర్య చేస్తారని, సమీప గ్రామాల్లోని మహిళలు బైబిల్ మిషన్ స్త్రీల సభకు హాజరుకావాలని కోరారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో కౌశిక్‌కు కాంస్య పతకం

దెందులూరు: 68వ పోటీల్లో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో దెందులూరు నియోజకవర్గ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అసీన్ వలీ అన్నారు. ఈనెల 3 నుంచి ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహిస్తోన్న రెజ్లింగ్ పోటీలకు దెందులూరు మండలం పోతునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి తాతినేని కుందన కౌశిక్ అండర్ 14 ఫ్రీ స్టైల్ విభాగంలో రాష్ట్రస్థాయిలో కాంస్య పతకం సాధించినట్టు హెచ్‌ఎం షేక్ అసీన్‌వలీ, ఫిజికల్ డైరెక్టర్ ఎం కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది మండల ఎంఈఓలు ఏవీఎన్ వరప్రసాద్, కె.అన్నమ్మ, నాయకులు కౌశిక్‌ను అభినందించారు.

గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక విప్లవం

దెందులూరు: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గ్రామీణ శివారు ప్రాంతాల్లో రైతాంగం సాంకేతిక పరిజ్ఞానం వైపు మొగ్గుచూపుతున్నారు. సాధారణ వ్యవసాయం నుంచి సేంద్రియ వ్యవసాయం, సాంకేతిక పరికరాల వినియోగంపై రైతుల్లో ఆసక్తి నెలకొంది. దీంతో గ్రామాల్లో వరి పొలాల్లో పురుగుమందు పిచికారీకి డ్రోన్ల వినియోగం పెరిగింది. డ్రోన్‌తో పిచికారీ చేయించడంవల్ల వరి దుబ్బు అంతటికీ పూర్తిస్థాయిలో మందు పడుతోందని, సమయం ఆదా అవుతోందని రైతులు తెలిపారు. దీంతో కూలీల సంఖ్య తగ్గడం, సాగులో సంతృప్తికరమైన దిగుబడి వస్తోందని వారు వివరించారు. దీంతో ప్రైవేటు కంపెనీలు డ్రోన్లను గ్రామాల్లోని రైతులకు ఏజెంట్లద్వారా సరఫరా చేస్తున్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	21
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	14
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	29

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	15
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	19
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	13
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	22
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	20
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	15
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	74	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	54	చిక్కుడు కాయలు	68-96
వంకాయలు (కాంతులు)	60	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	50	ములక్కాడలు	07,10
బెండకాయలు	34	కంద	50
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	40
కాకర కాయలు	38-44	కీరా దోస	40
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	128
బీరకాయలు (పందిరి)	54	అల్లం	70-150
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	48-58	పాలకూర	15
దొండకాయలు	60	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	12
ఉల్లిపాయలు	40-56	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణి	--
ఆనపకాయ (1)	30	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	48